క్లుప్తంగా

ధర్నా జయప్రదం చేయండి



కరపత్రం ఇస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఈనెల 15న చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌గంగన్న కోరారు. మండల కేంద్రంలోని బీడీ కార్మికులతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వారందరికీ ప్రభుత్వం జీవనభృతి రూ.2,016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు బీడీ కార్మికులు రావాలని కరపత్రం పంపిణీ చేశారు. లక్ష్మి, భారతి, జమున, కవిత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్సై సుమలత

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్‌లో గల శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు పోలీసులు శనివారం శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై సుమలత మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే డయల్ 100, 1930, 1809 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం కొండూరు నరేశ్, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన రవీందర్‌రావు



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీందర్‌రావు

ఖానాపూర్: ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్లి తిరిగివచ్చిన రాష్ట్రమంత్రి కేటీఆర్‌ను మాజీ ఏపీపీఎస్సీ మెంబర్ పైడిపల్లి రవీందర్‌రావు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఖానాపూర్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు.

రేపు మహా పాదయాత్ర



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఈనెల 11న శ్రావణ సోమవారం పురస్కరించుకుని లోక కల్యాణార్థం కోసం జిల్లాకేంద్రంలోని గండి రామన్న ఆలయం నుంచి కదిలి పాపహరేశ్వర ఆలయం వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామని గండి రామన్న ఆలయ చైర్మన్ లక్కాడి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పాదయాత్రలో భాగంగా చిట్యాల గ్రామంలో తేనేటి విందు, దిలావర్‌పూర్ జూనియర్ కళాశాలలో అల్పాహారం, కదిలి పాపారేశ్వర ఆలయంలో అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్, దశరథ్, రాజేశ్వర్, అంబటి మహేశ్, సోమేశ్వర్ సంతోష్, నందు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



హాసినిని సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన హాసిని, రాహుల్ ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి మెడిసిన్‌లో సీటు సాధించారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్‌లు శనివారం హాసిని, రాహుల్‌ను సన్మానించారు. గ్రామ పంచాయతీలో వారిని సర్పంచ్ ముత్యంరెడ్డి సత్కరించారు. ఏపీడీ ప్రసాద్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రమేశ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వేణుగోపాల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రవి కిరణ్ పాల్గొన్నారు.

ఇల్లే నందనవనం

- పూలు, పండ్ల మొక్కల పెంపకం
- సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు
- మేడలపై పెంపకం చేపడుతున్న పలువురు

సండే స్పెషల్

నిర్మల్‌ఖిల్లా: రసాయన ఎరువులతో పండించిన కూరగాయలు తినడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యంపై దృష్టిపెడుతున్నారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలని, పండ్లు, పూల మొక్కలు పెంపకం చేపట్టాలనే ఆసక్తి పలువురిని ఇంటి పంటలు వేసేలా అడుగులు వేయించింది. మేడలపై పూలమొక్కలతో మొదలైన మిద్దెతోట ఇప్పుడు ఇంటి పంటలతో వనంలా తయారు చేసుకుంటున్నారు జిల్లాలోని పలువురు. ఈ నేపథ్యంలో సండే స్పెషల్ కథనం.

టెర్రస్ గార్డెనింగ్‌పై దృష్టి..

టెర్రస్ గార్డెనింగ్‌పై మహిళలు, పలువురు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. మిద్దెతోటల పెంపకంలో ఆసక్తి చూపుతున్నారు. డాబాలు, బహుళ అంతస్తుల భవనాలపై, ఇంటి ఖాళీ జాగాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు పండించుకునేందుకు అవసరమైన విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. మిద్దెతోట అంటే అదేదో పెద్ద వ్యవసాయ క్షేత్రం అనుకుంటే పొరపాటే. మన కళ్ల ముందు బోలెడు వస్తువులతో ప్రారంభించవచ్చు. ఇందుకు టెర్రస్ గార్డెనింగ్‌లో ప్రత్యేక అభిరుచితో పలువురు ముందుకు సాగుతున్నారు.



ఇంటిపై పెంచిన మొక్కలతో దర్శనం లింగన్న



మొక్కలతో దేవరావు ఇంటి ముందరి భాగం

ముచ్చటైన మిద్దెతోట

నిర్మల్ సమీపంలోని గంజాల్‌కు చెందిన దర్శనం లింగన్నకు చిన్న ఇల్లు ఉంది. దాదాపు 20 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ ఇంటి డాబాపై దాదాపు 100 రకాలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. ఇందులో హరితహారంలో కొన్ని మొక్కలు, మరికొన్ని కొనుగోలు చేశాడు. వీటిలో పూలు, పండ్లు, నీడ నిచ్చే మొక్కలున్నాయి. కోతులు, ఇతర జంతువుల నుంచి వాటిని కాపాడుకుంటున్నాడు.



ఇంటి డాబాపై గార్డెనింగ్‌లో పూలమొక్కలు

ఇంటి డాబాపై మొక్కల పెంపకం



జిల్లాకేంద్రానికి చెందిన తుమ్మల దేవరావు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. తన ఇంటి చుట్టూ, ఖాళీ స్థలంలో మొక్కలే కనిపిస్తాయి. ఇంటి డాబాపై మిద్దె తోట ఏర్పాటు చేసి అనేక పండ్ల మొక్కలు పెంచుతున్నారు. నిమ్మగడ్డి, ఆకుకూరలు, సపోటా, బొప్పాయి, జామ, దానిమ్మ తదితర ఉన్నాయి. ఇంట్లోకి సరిపడా కూరగాయలు టెర్రస్ గార్డెన్ ద్వారానే సమకూర్చుకుంటున్నారు. పాలకూర, మెంతికూర, కొత్తిమీర, వంకాయ, బీర, కాకర పెంచుతున్నారు. సాయంత్రం వేళ ఈ మొక్కల మధ్యన నీడలో కూర్చొని తనకిష్టమైన రచనలను చేసుకుంటున్నారు.

ఇంటి మొక్కలతో ఆహ్లాదం, ఆరోగ్యం



ఇంటి వద్ద పండ్లు, పూల మొక్కలు, కూరగాయల వల్ల ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం లభిస్తుంది. ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్, టెర్రస్‌పై మిద్దెతోట లాంటివి చేపడితే మనసుకు ప్రశాంతత కలుగుతుంది. మిద్దెతోటలపై మహిళలను చైతన్య పరుస్తున్నాం. గృహిణులకు కూరగాయల, ఆకుకూరల మొక్కలను డీఆర్డీఓ శాఖ తరఫున పంపిణీ చేస్తున్నాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

భళా.. స‘జీవ’ కళ !



ఆకట్టుకునేలా మలిచిన వినాయక ప్రతిమ ఇదే



ప్రతిమను తయారుచేస్తున్న శ్రావణ్‌కుమార్

- మట్టితో వినాయక విగ్రహాలు తయారీ
- చిత్రలేఖనంలోనూ ప్రతిభ చాటుతున్న యువకుడు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ అంబేద్కర్ కాలనీకి చెందిన యువకుడు అడ్డిగ శ్రావణ్‌కుమార్ మట్టితో వినాయక ప్రతిమలను మలుస్తూ అబ్బురపరుస్తున్నాడు. ఈ విగ్రహాలకు జీవం పోస్తున్నాడు. పాఠశాల స్థాయి నుంచి అభిరుచిగా మారిన విగ్రహాల తయారీ ప్రస్తుతం అందమైన ప్రతిమలు, చిత్రాలకు సజీవ కళను తెస్తున్నాడు. డిగ్రీ పూర్తి చేసిన ఈ యువకుడు ఈ కళలో ఎలాంటి శిక్షణ లేకుండానే స్వతహాగా నేర్చుకుని ప్రతిభ చాటుతున్నాడు. 7వ తరగతి నుంచి చిత్రలేఖనం, మట్టి ప్రతిమల తయారీతో తన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడు. వినాయక చవితి నేపథ్యంలో మట్టితో ప్రతిమలను తయారు చేసి పలువురికి ఉచితంగా అందజేస్తున్నాడు. రసాయన రంగులు వాడకుండా పర్యావరణ పరిరక్షణకు ఊతమిస్తూ నల్లని మట్టితో విగ్రహాలు తయారీ చేస్తున్నాడు. వీటిని ఈ ఏడాది పంపిణీ చేస్తానని చెబుతున్నాడు. తనకున్న ఖాళీ సమయాల్లో జానపద పాటల చిత్రీకరణ బృందంలో నృత్య కళాకారుడిగా సైతం శ్రావణ్‌కుమార్ రాణిస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ రాజ రాజేశ్వరాలయం, ఓలా శివాలయం, కుంటాల మహాదేవుని, ఉమామహేశ్వర ఆలయాలు శ్రావణమాస శనివారం పురస్కరించుకుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పూజలు నిర్వహించారు. వానల్‌పాడ్‌కు చెందిన సుశీల–భూమేష్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచ్ సునీత భోజన్న, ఉప సర్పంచ్ ఆయిటి రాజన్న, ఆలయ కమిటీ, వీడీసీ చైర్మన్లు పాల్గొన్నారు.

తానూరు: బోరిగాం సమీపంలోని మహాదేవున్ని ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం కావడంతో భక్తులు పూజలు చేశారు. భైంసా శివప్రసాద్ సేట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు ‘ఆత్మహత్యల నివారణ’ ర్యాలీ

నిర్మల్: ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 6గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి శివాజీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు సైక్లింగ్‌క్లబ్ ప్రతినిధి, డాక్టర్ బీఎల్ఎన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో కలెక్టర్, ఎస్పీలు, నిర్మల్ సైక్లింగ్‌క్లబ్ సభ్యులు, సైకియాట్రిస్టులతో పాటు విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు

నిర్మల్: నిర్మల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిత్వ పరిశీలన కోసం పార్టీ సీనియర్‌నేత డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు పలువురు పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు అందించారు. నిర్మల్ టికెట్ కోసం ఖానాపూర్‌కు చెందిన మరోనేత దరఖాస్తు చేసుకోగా, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి శనివారం వరకు తన అప్లికేషన్ అందించలేదు. దరఖాస్తు ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది.

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ భైంసా పట్టణ మాజీ అధ్యక్షుడు గాలి రవి, కుభీర్‌కు చెందిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

ఖానాపూర్: బీజేపీ ఖానాపూర్ ఎమ్మెల్యే టికెట్ కోసం పార్టీ నియోజకవర్గ నాయకుడు అజ్మీరా హరినాయక్ శనివారం రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అంతకుముందు హైదరాబాద్‌లోని దుర్గామాత ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషా సంస్కృతిని కాపాడడం కోసం కాళోజీ నిరంతర పోరాటం చేశారని వక్తలు కొనియాడారు. ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అభివృద్ధి పనులపై విచారణ జరిపించాలి

కడెం: మండలంలోని కొత్త మద్దిపడిగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై విచారణ చేపట్టాలని ఉప సర్పంచ్ జాగిరి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రూ.కోటి 70 లక్షలకు సంబంధించిన సీసీ రోడ్ల పనులను ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు తెలియకుండానే తీర్మానం చేసి ఆ పనులను సర్పంచ్ భర్త ఇందుర్ కమీషన్ల కోసం ఇతరులకు అప్పగించారని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఆ పనులు నిలిపివేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ జాగిరి శ్రీనివాస్, వార్డు సభ్యులు దశరథ్, భాగ్యలక్ష్మి గంగమని, అడెల్లు, రాజగౌడ్, గ్రామస్తులు దుల్లే వెంకటేశ్, మార్కరి నవీన్, రాజన్న రాజలింగం, రవి తదితరులు ఉన్నారు.


‘ఆరోపణలు అవాస్తవం’

అభివృద్ధి పనుల్లో ఉప సర్పంచ్‌కు డబ్బులు ఇవ్వనందుకే అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ జడ రాజమణి అన్నారు. ఈ ఆరోపణలు అవాస్తవమన్నారు. గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా తోడ్పడాలన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ సమీపంలోని అక్కకొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి శనివారం పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకుడు వంశీకష్ణచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి ఐకేరెడ్డి సోదరుడు సురేందర్‌రెడ్డి, పీఏ కార్తీక్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండాడి జగ్గారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజా రమేశ్‌గౌడ్, సారంగాపూర్ సర్పంచ్ మేకల రాజారెడ్డి, దిల్దార్‌నగర్ సర్పంచ్ బి.విజయ స్టీఫెన్, ఎలగడప సర్పంచ్ ఆగునూరి సత్యమ్మ, గంగన్న తదితరులు పాల్గొన్నారు.


పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ తల్లి భూమవ్వ ఇటీవల మృతి చెందింది. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోపాటు భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబు శనివారం బాధిత కుటుంబీకులను వేర్వేరుగా పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట చిన్నారావు, రవీందర్‌రావు, గొల్ల పెద్ద గజ్జారాం, వెంకట్‌రావు, ఓ.అనిల్ కుమార్, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన యువకులు

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్ తండా, మామడ మండలం నల్దుర్తి తండాకు చెందిన ఎంపీటీసీ పడాల శ్రీనివాస్‌తోపాటు పలువురు, సారంగాపూర్ మండలంలోని నాగపూర్‌కు చెందిన పలువురి గ్రామస్తులు శనివారం విలాస్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు తన క్యాంప్ కార్యాలయంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బురద రోడ్లతో తిప్పలు

- భారీ వర్షాలతో నడవలేని పరిస్థితి
- కుంబి వాసులకు తప్పని ఇక్కట్లు

భైంసారూరల్: గడ్డెన్నవాగు ప్రాజెక్టు పునరావాస గ్రామమైన కుంబిలో ఇక్కట్లు తప్పడం లేదు. వర్షాకాలం వచ్చిన ప్రతీసారి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బురదరోడ్లపై నడవలేకపోతున్నారు. భారీ వర్షాలకు గ్రామీణ రహదారులన్నీ బురదమయంగా మారాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు సాగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

పునరావాస గ్రామమైన..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భైంసా మండలం కుంబి, టాక్లి, లింగా గ్రామాలు ముంపునకు గురయ్యాయి. కుంబి, లింగా, టాక్లి గ్రామాలకు పునరావాసం కల్పించారు. పునరావాసం కోసం స్థలం సేకరించి అక్కడే ఇళ్లు, పాఠశాలలు, మందిరాలు నిర్మించారు. పాత గ్రామాలను వదిలి వీరంతా పునరావాస గ్రామాల్లో వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన ఇప్పటికీ ఆ దిశగా పనులు చేపట్టలేదు. దీంతో స్థానికులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతునే ఉన్నారు.

ప్రధాన రోడ్లు లేక..

పునరావాస గ్రామాల్లో రోడ్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రతి వర్షాకాలంలోనూ పునరావాస గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొద్దిపాటి వర్షాలకే రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. వర్షాకాలం వస్తే కొన్ని ప్రాంతాల్లోనే బైక్‌లు నడుస్తున్నాయి. మిగతాచోట్ల కాలినడకన వెళ్దామన్న బురదపై జారి కిందపడుతున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు ప్రతీరోజు బురదరోడ్లపై జారి పడుతున్నారు. ప్రధాన వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు వేడుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయి సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన రోడ్డు

ఇబ్బందులు లేకుండా చూస్తాం

పునరావాస గ్రామాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఉన్నతాధికారులతో చర్చించి పునరావాస గ్రామాల్లో రోడ్లు లేని ప్రాంతాలు గుర్తించి అక్కడ సీసీ పనులు చేపట్టే విషయంపై దృష్టిసారిస్తాం. గ్రామాల్లో ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– గోపాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో

సంక్షిప్తంగా

ఘనంగా గోపాల కలువలు

దస్తురాబాద్: మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా శనివారం గోపాల కలువల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీకృష్ణుడి, గొల్లభామ వేషధారణలతో ఆకట్టుకున్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాల్వల పనులు ప్రారంభం

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో సర్పంచ్ సుకన్య రమేశ్ శనివారం మురుగుకాల్వల పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.22లక్షలతో పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఎంపీటీసీ సునీత పోశెట్టి, మాజీ సర్పంచ్ అశోక్‌రావు, నాయకులు రావుల శ్రీనివాస్, కమల ముత్యం, రాజన్న, అనిల్, శేఖర్, పోశెట్టి, జనార్దన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: కురన్నపేట్ ఫీడర్ పరిధిలో 11 కేవీ మరమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. కురన్నపేట్, షేక్ సాహెబ్ పేట్, కాల్వగడ్డ, గుల్జార్ మార్కెట్, బాలాజీవాడ, బ్రహ్మపురి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

బాలకవి సమ్మేళనంలో ప్రతిభ

ముధోల్: చిమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం భైంసా మేదా పాఠశాలలో శనివారం నిర్వహించిన బాలకవి సమ్మేళనంలో రబీంద్ర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. పి.ఈశా, పి.సౌజన్య, ఎస్.గౌరీ ప్రియ, శ్రీ హర్షలకు ప్రశంసపత్రాలు అందజేశారు.

నేడు వర్షావాజ్

తానూరు: భైంసా పట్టణంలోని సిద్దార్థనగర్ లుంబిని బుద్ధవిహార్‌లో ఆదివారం వర్షావాజ్ కార్యక్రమం ఉంటుందని భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆయా మండలాల భారతీయ బౌద్ధమహాసభ నాయకులు హాజరు కావాలని కోరారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ వీర హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం ఉదయం 8:30 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నట్లు భక్త జన మండలి సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో హనుమాన్, శివ, గజ్జలమ్మ, అయ్యప్ప దీక్షలు చేపట్టిన వారితోపాటు అందరూ హాజరు కావాలని కోరారు.

గొర్రెల యూనిట్లు సద్వినియోగం చేసుకోవాలి

కడెం: రాష్ట్ర ప్రభుత్వం గొల్లకుర్మలకు ఉచితంగా అందజేస్తున్న గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అలెగ్జాండర్ కోరారు. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన యాదవులకు శనివారం ఆరు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. వెటర్నరీ డాక్టర్ విజయకుమార్ తదితరులు ఉన్నారు.

నేడు హిందూవాహిని బైక్ ర్యాలీ

భైంసాటౌన్: నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా హిందూవాహిని మహిళ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. భైంసాలోని పులేనగర్ సుభద్రవాటిక శ్రీ సరస్వతి శిశుమందిర్ నుంచి ఉదయం 8 గంటలకు జాతీయజెండాలతో నిర్మల్‌లోని వేయి ఉరులమర్రి వరకు ర్యాలీ కొనసాగనుంది. జాతీయవాదులు, హిందూవాహిని కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు శివాలయంలో రుద్రాభిషేకం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని నాగరేశ్వరవాడ శివాలయంలో అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు 108 జంటలతో రుద్రాభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రాజ్‌గోండ్ సేవాసమితి మండల అధ్యక్షుడిగా నాగేశ్

ఖానాపూర్: రాజ్‌గోండ్ సేవాసమితి ఖానాపూర్ మండల అధ్యక్షుడిగా మడావి నాగేశ్ నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రం రాజేశ్వర్, భీంరావు ఓ ప్రకటనలో తెలిపారు. తనను నియామకానికి సహకారం అందించినవారికి నాగేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. శనివారం కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరగా, త్వరలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఏఈ హరిభూషన్, స్థానిక కౌన్సిలర్ అబ్దుల్ మతిన్, తదితరులు ఉన్నారు.